వివిధ లా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల రెగ్యులర్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్షలు, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్షలను ఈ నెల 16నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 8లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 8లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10వేల చొప్పున చెల్లించి వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.



ఆదివారం జరిగే బోనాల వేడుకలకు రావాలంటూ ఆహ్వానం పలుకుతున్న ముత్యాలమ్మ,పోచమ్మ ఆలయ ఫౌండర్ ట్రస్టీ పరికిబండ కళాప్రకాశ్, ఆలయ నిర్వాహకులు

బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

రెండు రోజుల పాటు వేడుకలు ● సోమవారం భవిష్యవాణి ● ముస్తాబైన మేడిబావి పోచమ్మ,ముత్యాలమ్మ ఆలయం

సికింద్రాబాద్,ఆగస్టు 2 : ఆషాఢ బోనాల జాతరకు సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మేడిబావి పోచమ్మ,ముత్యాలమ్మ ఆలయం ముస్తాబైందని ఆలయ ఫౌండర్ ట్రస్టీ పరికిబండ కళాప్రకాశ్ తెలిపారు.ఈమేరకు శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా అమ్మవారి ఆషాఢ బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెండు రోజుల పాటు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.ఈ వేడుకలకు స్పీకర్ గడ్డం ప్రసాద్,మంత్రి సీతక్కలతో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్,స్థానిక కార్పొరేటర్ హేమ తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు.

పోలీసుల బందోబస్తు

బోనాల జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చిలకలగూడ పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.అమ్మవారి ఆలయాలతో పాటు ప్రధాన చౌరస్తాలు పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాలతో చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అదీప్ పటిష్ట బందోబస్తు చేపట్టారు.అనుమానిత ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కంటోన్మెంట్ మూడో వార్డు బాలంరాయ్‌లో ఈ నెల 4,5 తేదీల్లో శ్రీ దండు మారెమ్మ ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు ఆలయ ఈఓ రవికాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్, నరేష్, రవి, వెంకట్, నాగరాజులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. – మారేడ్‌పల్లి, ఆగస్టు 2

'గాంధీ'లో బోనాల ఉత్సవాలు

బోనాలతో కలిసి ఆలయానికి వెళ్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 2 : టీఎన్‌జీఓ గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఆషాఢం సందర్భంగా శుక్రవారం పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ సంప్రదాయ పద్ధతిలో మహిళా ఉద్యోగులు ఊరేగింపుగా వెళ్ళి బోనాలను అమ్మవారికి సమర్పించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్.ఎన్.రాజకుమారి, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, టీఎన్‌జీఓ రాష్ట్ర నాయకులు డాక్టర్ ముజీబ్, జగదీశ్, గాంధీ యూనిట్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి ప్రసన్న, విశ్వనాథ్, భావనా సింగ్, శ్రావణ్ హాజరయ్యారు.

బీసీల కులగణన చేపట్టాలి

హలో బీసీ... చలో అమృత్‌సర్'పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ మహిళా సంక్షేమ సంఘం నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఈ నెల 7న అమృత్‌సర్‌లో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణిమంజరి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన 'హలో బీసీ... చలో అమృతసర్'పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిమంజరి మాట్లాడుతూ మహాసభకు దేశవ్యాప్తంగా బీసీలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కులగణన చేయడం ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు తార, సంధ్య, స్వర్ణ, గౌతమి, సుజాత, విజయలక్ష్మి, సరిత, వాణి, మీనా, రేణుక, పద్మావతి, రాజేశ్వరి, వరలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై బస్తీలలో అవగాహన

దోమల నివారణపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్రీనివాస్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 2 : ఇండ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలను నివారించడం మన అందరి భాధ్యత అని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులతో కలిసి భోలక్‌పూర్‌లో స్థానిక మహిళలకు 'దోమల నివారణ చర్యలపై' అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పైకప్పులో పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ ఉండడం వలన అందులో లార్వా నుంచి దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఉన్న లార్వాలను ఆయన ఒక చెంచాలో వేసి ప్రజలకు చూపించారు. ప్రజల సహకారంతోనే దోమలను నివారించగలమన్నారు. అనేక పాఠశాలలు, కాలేజీలు, కాలనీలు, బస్తీలలో ప్రజల వద్దకు వెళ్ళి అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈఎఫ్ఏ రాజేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి యంత్రం అందజేత : చాంద్రాయణగుట్టలోని బండ్లగూడకు చెందిన కరీం అనే మూడేండ్ల బాలుడు పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతుండగా లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎ.భాస్కర్ రెడ్డి తన 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆ బాలుడికి ఆధునిక వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఎంబీఎఫ్ ట్రస్టీ వసంత సేతురామన్, డైరెక్టర్ రంగనాథన్, ప్రసాదరావు, మురళీ నటరాజన్, రాఘవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. –బన్సీలాలోపేట్, ఆగస్టు 2

నోట్‌పుస్తకాల పంపిణీ : మోండా డివిజన్ గ్యాస్ మండి, ఆదయ్యనగర్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీలను పంపిణీ చేశారు. –మారేడ్‌పల్లి, ఆగస్టు 2

30 ఏండ్ల కల..నెరవేరిన వేళ

ఉస్మానియా యూనివర్సిటీ/బన్సీలాల్‌పేట్, ఆగస్టు 2: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై ఉస్మానియా యూనివర్సిటీ మాదిగ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు సామాజిక న్యాయం నెరవేర్చడానికి వచ్చిన తీర్పుగా అభివర్ణించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ నిబద్ధతతో పోరాడితే న్యాయం తప్పకుండా లభిస్తుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. గ్రూప్ వన్ మెయిన్స్, ఇంటర్వ్యూలలో కూడా రిజర్వేషన్లు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే గవర్నర్ ఆర్డినెన్స్ తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. వెంటనే ఆర్డినెన్స్ తీసుకువచ్చి రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, ప్రొఫెసర్ కాశిం, ఓయూ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్, ప్రొఫెసర్ డైసీ, డాక్టర్ మేడి శ్రీనివాస్, డాక్టర్ వంశీధర్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ మాదిగ ప్రొఫెసర్లు

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు

30 ఏండ్ల పోరాటానికి ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకుడు కే.కుమార్‌బాబు మాదిగ అన్నారు. న్యూబోయిగూడలోని గొల్లకొమరయ్య కాలనీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, ఇంటింటికి వెళ్ళి మిఠాయిలను పంచిపెట్టారు. బీఆర్ఎస్ నాయకులు ఎస్.రాజేందర్, దేశపాక శ్రీను, కే.దేవేందర్, కే.శ్రీనివాస్‌లు న్యూబోయిగూడలోని కీస్ బ్లాక్స్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జంట విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రాగటి సత్యం, కేఎం.కృష్ణ, ఎస్‌వై.గిరి, నర్సింగ్‌రావులను సన్మానించారు.

గొల్లకొమరయ్య కాలనీలో ఎమ్మార్పీఎస్ సీనియర్లను , దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ రాగటి సత్యంను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, ఆగస్టు 2: రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గాజుల రామారంకు చెందిన బొక్క నందకిశోర్ గుండ్లపోచంపల్లి– బొల్లారం రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కంటోన్మెంట్ ఒకటో వార్డులో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు ఆయన కార్యాలయంలో శుక్రవారం బోయిన్‌పల్లి సీనియర్ నాయకులు బల్వంత్ రెడ్డితో కలిసి మైనార్టీ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో అక్బర్, సిరాజ్, మోహీన్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు. –బొల్లారం

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

బేగంపేట్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం కొల్లూరులోని గౌడియం స్కూల్ విద్యార్థులకు రోడ్ల భద్రత, నియమాల గురించి ట్రాఫిక్ సిబ్బంది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలు రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి విద్యార్థులకు బేగంపేట టీటీఐలో నిర్వహించిన అవగాహన శిబిరం ఉత్సాహంగా జరిగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్న ఈ శిబిరంలో ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు టీటీఐ సిబ్బంది వీసీ అయాన్, శ్రీకృష్ణ, హీరో మోటర్స్ ప్రతినిధి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. – బేగంపేట్, ఆగస్టు 2

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు

అడ్డగుట్ట, ఆగస్టు 2 : ఆషాఢమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం మెట్టుగూడ అధ్యక్షులు బెజిగం శ్రీధర్‌గుప్తా ఆధ్వర్యంలో మెట్టుగూడ వైజంక్షన్ వద్ద శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆప్యాయంగా ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని ఐక్యతను చాటుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వైశ్య కుటుంబీకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆడిపాడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మెన్ గుండా రమేష్, అధ్యక్షులు శ్రీధర్ గుప్తా, ప్రతినిధులు నరేందర్, వీరేష్, మధుబాబు, వేణుగోపాల్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పెంటమళ్ల లావణ్యకు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో పెంటమళ్ల లావణ్య డాక్టరేట్ సాధించారు. మాజీ లైబ్రేరియన్ డాక్టర్ ఆర్‌కే పవన్‌కుమార్ పర్యవేక్షణలో 'ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా లైబ్రరీ సర్వీసెస్ ఫర్ జర్నలిస్ట్ ఇన్ హైదరాబాద్'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి లావణ్య సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమెను విభాగం హెడ్ డాక్టర్ జె. వివేక్‌వర్ధన్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్. యాదగిరి, డాక్టర్ ఏఎస్ చక్రవర్తి, సిటీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ చేగోని రవికుమార్ తదితరులు అభినందించారు.

రేపు సంగీత కార్యక్రమం

చిక్కడపల్లి: జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ 94వ జయంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన సుప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ సంగీత విధ్వాంసులు కళారత్న డీవీ మోహనకృష్ణ, ప్రముఖ డాక్టర్ రంగయ్యతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సంగీత కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

బొల్లారం,ఆగస్టు 2:కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని జయానగర్ నల్లపోచమ్మ దేవాలయంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్,సీనియర్ నాయకులు అరుణ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.దేవాలయంలో దొంగతనాలు జరుగకుండా భద్రత నిమిత్తం ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభు,టింకు గౌడ్, అనిల్, ప్రకాశ్,అశోక్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, అరుణ్ యాదవ్

నర్సింగ్ కౌన్సిల్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

కాచిగూడ, ఆగస్టు 2 : నర్సింగ్ కౌన్సిల్‌లో జరిగిన అక్రమాలకు కారకులైన రిజిస్ట్రార్ బండ విద్యావతిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం నిరుద్యోగ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్, సంఘం ప్రతినిధులు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. 11 ఏండ్లుగా కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా విద్యావతి తిష్టవేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్నదని ఆరోపించారు. నర్సింగ్ కౌన్సిల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపడుతామని మంత్రి రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

అంబర్‌పేట, ఆగస్టు 2 : అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్, మల్లికార్జుననగర్‌లో రూ.80లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్లలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వాటర్‌వర్క్స్ మేనేజర్ మాజిద్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు టి.రమేశ్, కనివేట నర్సింగ్‌రావు, మిర్యాల రవీందర్, బోనం వీరబాబు, మిర్యాల శ్రీనివాస్, ఎన్.వెంకటరమణరాజు, ఉప్పు సుధాకర్,పంజాల చంద్రశేఖర్, నరహరి, ప్రసూన, సునీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.